
ఆంధ్రజ్యోతి

5 

తిరుపతి
జిల్లా వార్తలు

శుక్రవారం 30 మే 2025





శ్రీవారి మెట్టు మార్గాన నడిచి వస్తున్న భక్తులు

తిరుమలలో పెరిగిన రద్దీ

వేసవి సెలవులు చివరికి చేరుకోవడంతో తిరుమలకొండకు భక్తులు పోటెత్తారు. గురువారం నుంచే ఎటు చూసినా జనం కనిపిస్తున్నారు. క్యూలలోని సర్వద ర్శన భక్తులకు 16 గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారిపాదాలు, అలిపిరి కాలినడకదారులు సైతం రద్దీగా మారాయి. - తిరుమల, ఆంధ్రజ్యోతి

హీరో శ్రీకాంత్ కుటుంబీకుల
నవగ్రహ శాంతిపూజలు

శ్రీకాళహస్తి పట్టణం సన్నిదివీధిలోని రాఘవేంద్ర స్వామి మఠంలో హీరో శ్రీకాంత్ కుటుంబ సమేతంగా గురువారం నవగ్రహ శాంతి పూజలు చేయించుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు. కాగా, ముక్కంటి ఆలయంలో పనిచేసేకొందరు అర్చకులు, పండితులు శ్రీకాంత్‌కు ప్రైవేటు పూజలు నిర్వహించడం, ఆ ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసుకోవడం విమర్శలకు తావిచ్చింది.

- శ్రీకాళహస్తి , ఆంధ్రజ్యోతి



తిరుమలలో శ్రియ

హీరోయిన్ శ్రియ గురువారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల పలువురు అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారిని, శ్రీకాళహస్తీశ్వరుడిని కూడా శ్రియ దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




కాలినడక భక్తుల భద్రతపై
టీటీడీ మరో ముందడుగు

- ఏడో మైలు వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు నిర్ణయం
- సోలార్ లైవ్ కెమెరాలకు పిల్లలతో చిక్కిన చిరుత, ఎలుగుబంటి



తిరుమల నడకమార్గంలో ఏడో మైలు వద్ద ఏర్పాటు చేసిన సోలార్ లైవ్ కెమెరాకు రెండు పిల్లలతో చిక్కిన ఎలుగుబంటి



సోలార్ కెమెరాకు చిక్కిన చిరుత, చిరుత పిల్ల

మంగళం, మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తుల భద్రతపై టీటీడీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. అలిపిరి- తిరుమల నడక మార్గంలోని ఏడో మైలు సమీప ప్రాంతాల్లో చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉందని గుర్తించింది. అందుకని ఇక్కడే శాశ్వత ప్రతిపాదికన కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు సిద్ధమైంది. గతంలో అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లే ఈ నడకమార్గంలో భక్తులపై చిరుతలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఒక చిన్నారి తీవ్రంగా గాయపడగా, లక్షిత అనే బాలిక ప్రాణాలు కోల్పోయింది. అప్పట్లో కాలినడకన వెళ్లే భక్తులకు టీటీడీ కర్రలూ అందించింది. సాయంత్రం 6గంటల పైన నడకమార్గాన్ని మూసివేసింది. బోన్లు ఏర్పాటు చేసి నడకదారికి సమీపంలో వచ్చే చిరుతలను బంధించి కొన్నింటిని సుదూర అటవీప్రాంతాల్లో వదిలిపెట్టగా, మరికొన్నింటిని ఎస్వీ జూపార్కుకు తరలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 26 సోలార్ లైవ్ కెమెరాలనూ ఆ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లో చిరుత, దాని పిల్ల చిక్కాయి. మరో కెమెరాలో రెండు పిల్లలతో ఉన్న ఎలుగుబంటి దృశ్యం రికార్డు అయింది. ఈ ప్రాంతంలో తరచూ ఎలుగుబంట్లు, చిరుతలు రాత్రి వేళలో ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ఏడో మైలు వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

కంట్రోల్ రూమ్‌లోనే మానిటర్, రెస్క్యూటీం

ఇప్పటి వరకు నడక మార్గంలో రెస్క్యూటీంగా కొందరు ఉంటున్నారు. ఎక్కడైనా చిరుత, ఎలుగుబంట్లు ఉన్నట్లుగాని, నడక మార్గానికి దగ్గరగా వచ్చినట్లు గానీ తిరుపతిలోని బయోట్రిమ్ కార్యాలయానికి అందే సమాచారంతో వీరు అక్కడికి చేరుకుని వాటిని అడవిలోకి తరిమేలా చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు కంట్రోల్ రూమ్ ఏర్పాటైతే ప్రభుత్వ అటవీశాఖలోని ఇద్దరు బయాలజిస్టులు, పదిమంది సిబ్బంది, టీటీడీ అటవీశాఖ, విజిలెన్సు సిబ్బంది దాదాపు 30మంది ఇక్కడే ఉంటారు. కంట్రోల్ రూమ్‌లోని మానిటర్‌లో ఉన్న కెమెరాల ద్వారా వన్యప్రాణుల కదలికలను వీరు ఎప్పటికప్పుడు గమనిస్తూ చర్యలు తీసుకుంటారు. గతంలో ఇక్కడ ఎలివేటెడ్ పాస్ ఏర్పాటు చేస్తే మంచిదన్న నిపుణుల అభిప్రాయాలను మాత్రం ప్రస్తుతానికి టీటీడీ పక్కన పెట్టిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టీచర్ల బదిలీల, పదోన్నతుల్లో అభ్యంతరాలు

- డీఈవో పట్ల ఫ్యాప్టో నేత అమర్యాదకర ప్రవర్తన
- సమస్యకు కారణమంటూ జీడీ నెల్లూరు ఎస్జీటీపై కమిషనర్‌కు డీఈవో ఫిర్యాదు



డీఈవో వరలక్ష్మిని చుట్టుముట్టిన ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు సెంట్రల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఉత్పన్నమైన సమస్యలు, వాటి పరిష్కార వ్యవహారం గురువారం డీఈవో వరలక్ష్మి, ఫ్యాప్టో నాయకుల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది.పాఠశాల విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఈనెల 21న టీచర్ల బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి చిత్తూరు డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ సందర్భంగా టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఫ్యాప్టో నాయకులు లేవనెత్తిన సమస్యల్లో చాలావరకూ డీఈవో వరలక్ష్మి పరిష్కరించారు.సర్వీసు అంశాలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ తయారీ క్రమంలో ఏపీ స్టేట్ సబార్డినేట్ సర్వీసు 33ఏ ప్రకారం ప్రస్తుత క్యాడర్, పీరియడ్, డేట్ ఆఫ్ బర్త్, మేల్, ఫిమేల్ సీనియారిటీ, 2021 బదిలీల్లో అర్హత సాధించి, రీఆపోర్షన్(షిఫ్టెడ్)కు గురైన టీచర్లకు పాత స్టేషన్ పాయింట్లు వర్తింపజేయాలనే దానిపై డీఈవోకు, ఫ్యాప్టో సంఘం నేతలకు మధ్య వాదనలు చోటు చేసుకున్నాయి. ఇతర జిల్లాల్లో పాటిస్తున్న విధానమే ఇక్కడా అమలు చేయాలని ఫ్యాప్టో నాయకుల పట్టుబడుతూ డీఈవో వరలక్ష్మిని చుట్టుముట్టారు.పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నుంచి వివరణ తీసుకుని సమాధానం ఇస్తామని డీఈవో చెబుతున్నా తిరుపతి జిల్లా ఫ్యాప్టో నాయకుడు,రామచంద్రాపురం మండలం అనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పీడీ సురేష్ ఆమెను ఏకవచనంతో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఇక్కడే నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించడంతో పక్కనే ఉన్న చిత్తూరు జిల్లా ఫ్యాప్టో నాయకులు అవాక్కయ్యారు.మహిళ అని కూడా చూడకుండా అమర్యాదగా ప్రవర్తించడాన్ని డీఈవో కార్యాలయ సిబ్బంది తీవ్రంగా ఖండించారు. సమస్య జటిలం కావడానికి జీడీ నెల్లూరు మండలం అగ్రహారం ఎంపీయూపీఎస్ పాఠశాల ఎస్జీటీ పి.విజయ్‌కుమార్ కారణమని విద్యాశాఖ అధికారులు కమిషనర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు.మూడు రోజులుగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతూ పలు అంశాలపై ఉపాధ్యాయ సంఘాల నేతలను రెచ్చగొడుతున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా బదిలీలకు సంబంధించి ఫ్యాప్టో నాయకులు లేవనెత్తిన అంశాల్లో ఒకటైన, ఉపాధ్యాయుల బదిలీల క్రమంలో 2021 అర్హత సాధించిన వారికి రీఅపోర్షన్ కింద 2025లో పాత స్టేషన్ పాయింట్లు వర్తిస్తాయని డీఈవో వరలక్ష్మి వివరణ ఇచ్చారు. ఫ్యాప్టో నాయకులు జీవీ రమణ, మణిగండన్, మునీర్ అహ్మద్, మునాఫ్, గోపినాథ్, సోమశేఖర నాయుడు, మదనమోహన్‌రెడ్డి, చెంగల్రాయమందడి తదితరులు పాల్గొన్నారు.

167మంది హెచ్ఎంల బదిలీ

ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ముగిసింది. జిల్లా పరిషత్ యాజమాన్యంలో 155 మంది, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదుగురు, మున్సిపాలిటీల్లోని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు ఏడుగురు బదిలీ అయ్యారు.

ఎస్ఏలకు మొదలైన పదోన్నతి కౌన్సెలింగ్

స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) నుంచి గ్రేడ్-2 హెచ్ఎంల పదోన్నతి కౌన్సెలింగ్ గురువారం చిత్తూరులో మొదలైంది. జడ్పీ యాజమాన్యంలో 155, మున్సిపల్ కార్పొరేషన్లలో ఐదు, మున్సిపాలిటీల్లో ఐదు పోస్టులకు గాను 1:3 రేషియోలో 500 మంది ఎస్ఏలను పిలిచారు.

డీసీసీబీ నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస



చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు.ఈయన పదవీ బాధ్యతలు స్వీకరించిన తేది నుంచి 2025 జూన్ 26వ తేది వరకు లేదా ఎన్నికలు జరిగేంతవరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది.డీసీసీబీకి 2006లో జరిగిన ఎన్నికల్లో అమాస రాజశేఖరరెడ్డి చైర్మన్‌గా పోటీచేసి గెలుపొందారు.2011 వరకు ఆ పదవిలో కొనసాగిన ఆయన తరువాత జరిగిన ఎన్నికల్లో కూడా చైర్మన్‌గా ఎన్నికై మరో ఐదేళ్ల పాటు కొనసాగారు. అప్పటి ప్రభుత్వం సహకార సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో 2019 వరకు అమాస రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని పాలకవర్గమే కొనసాగింది.2019లో వైసీపీ ప్రభుత్వం ఈ పాలకవర్గాన్ని రాజీనామా చేయించారు. దీంతో వడమాలపేట మండలం కాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి (సింగిల్‌విండో) అధ్యక్షుడిగా కొనసాగారు.కాగా ప్రస్తుతం డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ విద్యాధరి కొనసాగుతున్నారు. త్వరలోనే అమాస రాజశేఖర రెడ్డి బాధ్యతలు చేపట్టబోతున్నారు.



నేటి నుంచి టోల్ గేట్ వసూళ్లు

ఏర్పేడు, మే 29(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని మేర్లపాక సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై శుక్రవారం నుంచి టోల్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. జాతీయ రహదారికి సంబంధించిన అధికారులు మూడు రోజులుగా ట్రయల్స్ వేశారు. కారుకు రూ.140, బస్సు, ట్రక్కులకు రూ.470 చొప్పున వసూలు చేయనున్నట్లు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ టోల్‌గేట్‌కు ఇరువైపులా 20 కిలోమీటర్ల మేరకు ఉన్న వైట్ బోర్డు వాహనదారులు నెలకు రూ.350 చెల్లించి పాస్ తీసుకోవాల్సి ఉంటుంది.

ఒక రోజు ముందే
పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), మే 29(ఆంధ్రజ్యోతి): జూన్ నెలకు సంబంధించిన పింఛన్లను ఒకరోజు ముందుగానే శనివారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జూన్ ఒకటిన ఆదివారం కావడంతో.. మే 31న పంపిణీ చేయలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,60,379 మందికి సుమారు రూ.117.4 కోట్ల పింఛను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.





మహానాడు సభ వద్ద చంద్రబాబుతో చంద్రగిరి, పలమనేరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, అమరనాథరెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి



మహానాడులో పార్టీ నిధికి రూ.5లక్షలు

- విరాళం అందించిన 'కోడూరు'

తిరుపతి, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానాడులో టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా పార్టీ నిధికి రూ.5లక్షల విరాళాన్ని ఆ పార్టీ నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం చెక్కు రూపంలో అందించారు. అలాగే, బాలాజీ, ఎలైట్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మహానాడులో 22 అంబులెన్సులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందజేశారు.

సీఎంకు హేమాంబరధరరావు శుభాకాంక్షలు



చంద్రగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన సీఎం నారా చంద్రబాబు నాయుడికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరదరరావు శుభాకాంక్షలు తెలిపారు. కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు కార్యక్రమంలో సీఎంను ఆయన గురువారం కలిశారు.

సీఎంను కలసిన దివ్యాంగుడు జీవన్



తిరుపతిరూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెకి చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడు (దివ్యాంగు డు) జీవన్‌కుమార్‌రెడ్డి కడపలో నిర్వహిస్తున్న మహానాడులో సీఎం చంద్రబాబును కలిశారు. 2024లో టీడీపీ అధికారంలోకి రావాలని, సీఎంగా చంద్రబాబు, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలుపొందాలని కోరుతూ గతంలో శ్రీవారిమెట్ల ద్వారా తిరుమలకు 16వారాలపాటు పాదయాత్ర నిర్వహించారు. వారానికి రూ.1116 చొప్పున 16వారాలకు సంబంధించి రూ.17,856 నగదుని శ్రీవారికి మొక్కుచెల్లించేందుకు సమకూర్చారు. దీన్ని తిరుమల శ్రీవారి హుండీలో వేయాలని చంద్రబాబుకు మహానాడులో అందించారు. స్పందించిన సీఎం తన చేతుల మీదుగానే శ్రీవారి హుండీలో వేయమని చెప్పారని జీవన్ పేర్కొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల వివరాలు సేకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న కో-ఆర్డినేటర్ చంద్రశేఖరరెడ్డి

ఎర్రావారిపాలెం, మే 29(ఆంధ్రజ్యోతి); మండలంలో ప్రత్యేకావసరాల పిల్లల వివరాలు సమగ్రంగా సేకరించినపుడే వారి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చునని జిల్లా సహిత విద్యా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఇర్లపాలెం, బండకాడపల్లె, మేదరపల్లెలో జరుగుతున్న సర్వే తీరు తెన్నులను గురువారం ఆయన పరిశీలించారు. ప్రత్యేకావసరాల పిల్లలు తప్పనిసరిగా భవిత కేంద్రాల్లో ఉండేలా చూడాలన్నారు. ఈ సర్వేలో ఐఈఆర్‌పీఎస్ టీచర్లు మధుమతి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిషోర్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు



అన్నదానం చేస్తున్న సాయి రాయల్ తదితరులు

తిరుచానూరు, మే 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుచానూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ తిరుచానూరు ప్రధాన కార్యదర్శి సాయిరాయల్ ఆధ్వర్యంలో నవజీవన్, బస్టాండు సెంటర్లలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు హరిరామ్‌రెడ్డి, రమణ రాయల్, జీవన్, వాసు, దిలీప్‌రాయల్, విజయ్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవితానికి యోగా సాధనం



యోగా చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

రామచంద్రాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర జీవితానికి యోగా మంచి సాధనమని యోగా కేంద్రం డైరెక్టర్ ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని సీ రామాపురంలో ఉన్న వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో రోజువారి శిబిరంతోపాటు సాధారణ కార్యకలాపాల శ్రేణి యోగా కనెక్ట్ పేరుతో ప్రారంభమైంది. ఆయన యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతాప్ స్క్వాడ్రన్‌లోని క్యాడెట్లు విజేతలుగా నిలిచారు. శారీరక దారుఢ్యం, సమన్వయం పెంపొందించడానికి షార్ట్‌లిస్టు చేయబడిన క్యాడెట్లకు ఎన్‌సీసీ నగర్‌లోని అబ్స్టాకిల్ కోర్సులు శిక్షణ ఇచ్చారు. అదే సమయంలో క్యాడెట్లకు ఏరో మోడలింగ్‌లో శిక్షణ ఇచ్చారు. విమానాయానం, మోడల్ బిల్డింగ్‌లో సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్లు సులోచనాదేవి, రామ్మూర్తి, శ్రీనివాసులు, కార్యాలయ పర్యవేక్షకులు సురేష్‌కుమార్, క్యాంపు పర్యవేక్షకులు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులందరికీ సరుకులు పంపిణీ చేయాలి



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటరమణ

రామచంద్రాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపు ద్వారా డీలర్లు కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించాలని తహసీల్దారు వెంకటరమణ అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన డీలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 8 వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. దుకాణం తెరవకపోతే అందుకు రాతపూర్వకంగా కారణం తెలిజేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ అన్వర్‌బాషా, పౌరసరఫరాల డీటీ యుగంధర్, ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, డీలర్లు పాల్గొన్నారు.

చెక్ బౌన్సు కేసులో మహిళకు ఏడాది జైలు శిక్ష

భాకరాపేట, మే 29(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో భాకరాపేటకు చెందిన తులసికి పీలేరు స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. భాకరాపేటకు చెందిన ఆమె అదే గ్రామానికి చెందిన యశ్వంత్, మంజుల, మల్లీశ్వరి నుంచి 2022 ఏప్రిల్‌లో రూ.25 లక్షలు అప్పుగా తీసుకుంది. అప్పు తీర్చమని వారు ఒత్తిడి చేయడంతో యశ్వంత్ పేరిట రూ.7 లక్షలు, మల్లీశ్వరి పేరిట రూ.9 లక్షలు, మంజుల పేరిట రూ.9 లక్షలకు చెక్కులు ఇచ్చింది. అవి బౌన్స్ కావడంతో బాధితులు పీలేరు స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు యశ్వంత్‌కు రూ.8లక్షలు, మంజుల, మల్లీశ్వరిలకు చెరో రూ.10 లక్షల చొప్పున చెల్లించాలని ఆదేశించింది. అంతే కాకుండా చెల్లని చెక్కులు ఇచ్చినందుకు తులసికి ఏడాది జైలు శిక్ష విధించింది.

పోలీసుల అదుపులో యూట్యూబర్

తిరుచానూరు, మే 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివాహితను ట్రాప్‌చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న యూట్యూబర్ కల్లూరు హేమాద్రిని తిరుచానూరు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సదరు యూట్యూబర్ వివాహితతో సన్నిహితంగా ఉండి, ఆ ఫొటోలను అప్‌లోడ్ చేస్తానని బెదిరించినట్లు తెలిసింది. మంగళంలోనూ ఓ మహిళను ఇదే విధంగా ఇబ్బందులకు గురిచేస్తుంటే సదరు మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చింది.

అమ్మవారి ఆలయానికి టిల్టింగ్ గ్రైండర్ వితరణ



తిరుచానూరు, మే 29(ఆంధ్ర జ్యోతి): తిరుచా నూరు శ్రీపద్మావతి అమ్మ వారి ఆలయ పోటుకు హైదరా బాద్‌కు చెందిన ఎన్ రామకృష్ణరావు 20 లీటర్ల కెపాసిటీ గల టిల్టింగ్ గ్రైండర్‌ను విరాళంగా అందజేశారు. దీన్ని ఆలయాధి కారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్, సూపరింటెండెంట్ రమేష్, ప్రసాదం ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు







బస్సులను ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు - బయలుదేరుతున్న చిన్నగొట్టిగల్లు నేతలు - బస్సును ప్రారంభిస్తున్న తిరుమలరెడ్డి

చంద్రగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు చంద్రగిరి మండల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. గురువారం ఉదయం ఆరు బస్సుల్లో, 50 సొంత వాహనాల్లో వెళ్లారు. చంద్రగిరిలో డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడు బస్సులకు జెండా ఊపి ప్రారంభిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌస్ బాషా, బాలకృష్ణమూర్తి, కొందూరు ప్రవీణ్, వినోద్, సక్కూరి ధనంజయరెడ్డి, హరి, గురునాథం, మంగాపురం భాస్కర్ పాల్గొన్నారు.

గరిటె తిప్పిన చంద్రగిరి తమ్ముళ్లు

చంద్రగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో ఎమ్మెల్యే పులివర్తి నాని నేతృత్వంలో చంద్రగిరి నుంచి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు భోజన ఏర్పాట్లలో సహాయపడ్డారు. వేణు, గురున్నాథం, శివకుమార్ వంట పనిలో సహాయపడ్డారు. ఎమ్మెల్యే నాని వారిని అభినందించారు.

చిన్నగొట్టిగల్లు మండలం నుంచి..

భాకరాపేట, మే 29(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. గురువారం ఉదయం రెండు బస్సులు, 30 సొంత వాహనాలలో టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కడపకు వెళ్లారు.

మహానాడుకు ఆర్‌సీపురం నేతలు

రామచంద్రాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడుకు ఆర్‌సీపురం నాయకులు, కార్యకర్తలు గురువారం తెల్లవారుజామున తరలివెళ్లారు. మండలం నుంచి రెండు బస్సులు, 40 కార్లకు పైగా కార్యకర్తలు వెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి మండల కేంద్రంలో జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. వెళ్లిన వారిలో నాయకులు జనార్దన్‌చౌదరి, హరిప్రసాద్, జేడీ జగన్, ఉమాపతినాయుడు, ఢిల్లీనాథరెడ్డి, మునెయ్య, ధనంజయరెడ్డి, గిరినాయుడు, దినేష్, సోమశేఖర్‌నాయుడు ఉన్నారు.



వంటలో సాయపడుతున్న చంద్రగిరి టీడీపీ నేతలు

బైక్, కారు ఢీ : ఒకరి మృతి







నుజ్జునుజ్జు అయిన కారు - తునాతునకలైన బైక్ - లోకేష్ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యగారిపల్లె వద్ద పీలేరు-తిరుపతి జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ద్విచక్ర వాహనదారుడు మృతి చెందా డు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బందార్లపల్లె హరిజనవాడకు చెందిన లక్ష్మణయ్య కుమారుడు లోకేష్(33) బుధవారం రాత్రి 9 గంటల సమయంలో చంద్రగిరి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. నాగయ్యగారిపల్లె వద్ద పీలేరు నుంచి తిరుపతికి వస్తున్న కారు ఢీకొంది. లోకేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌లో చేర్పించగా, తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వికసిత కృషి సంకల్ప అభియాన్ ప్రారంభం

తిరుపతి రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆధ్వర్యంలో వచ్చేనెల 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం గుంటూరు జిల్లా వేదికగా ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నిపుణులైన శాస్త్రవేత్తల నేతృత్వంలో భూసార పరీక్షలు, పశుపోషణ, యాజమాన్య పద్ధతులు, వ్యాధులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు రాష్ట్ర నోడల్ అధికారిణిగా వ్యవహరిస్తున్న వర్సిటీ డీఈ ప్రొఫెసర్ డాక్టర్ బి. శోభామణి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల నిజజీవిత అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించడమే వికసిత కృషి సంకల్ప అభియాన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న వెటర్నరీ వర్సిటీ డీఈ డాక్టర్ శోభామణి

వైభవంగా నడవలూరులో గంగజాతర

రామచంద్రాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడవలూరులో గంగజాతర గురువారం వైభవంగా జరిగింది. బుధవారం రాత్రి గట్టం కుండ ఇంటింటికీ వెళ్లి పూజలం దుకుంది. బుధవారం అర్ధరాత్రి రజకులు గంగమ్మను మట్టితో తయారు చేసి శోభాయ మానంగా అలంకరించారు. అక్కడి నుంచి మేళ తాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగుతూ నడివీధిలోకి చేరుకుంది. గ్రామస్తులు వేట పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర గ్రామాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు బారీగా భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి సారె తీసుకువచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, నియోజక వర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. వీరికి గంగమ్మ కమిటీ తీర్థప్రసాదాలు అందజేసి, దర్శన భాగ్యం కల్పించారు.



అమ్మవారికి సారె తెస్తున్న సుధారెడ్డి

పాకశాస్త్ర వర్సిటీలో డీజీఆర్ ట్రైనీలకు వీడ్కోలు



శిక్షణ పొందిన వారితో కలెక్టర్

రేణిగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ పాకశాస్త్ర వర్సిటీలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీ సెటిల్మెంట్ (డీజీఆర్)లో శిక్షణ పొందిన వారికి కలెక్టర్ వెంకటేశ్వర్ వీడ్కోలు పలికారు. రేణిగుంట మండలం జిపాళ్యం పంచాయతీలోని విశ్వవిద్యాలయంలో అవుట్ గోయింగ్ బ్యాచ్‌కు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వీరిని కలెక్టర్ అభినందించారు. వసతి, టూరిజం రంగంలో వారికి గొప్ప రెండవ కెరీర్‌ను కోరుకుంటున్నారన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ ఎం. తిరులోగ చందర్ పాక శాస్త్ర విద్యాయలం అందించే కోర్సులు, వసతి, టూరిజం పరిశ్రమలో విద్యార్థులకు అవకాశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అన్ని వంటశాలలు, ప్రయోగశాలను కలెక్టర్ సందర్శించి కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో పాకశాస్త్ర విశ్వవిద్యాలయం అధికారులు, సిబ్బంది శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు యాంటీ డ్రోన్ సిస్టమ్ డెమో పరిశీలన

తిరుమల, మే29(ఆంధ్రజ్యోతి): తిరుమలలో త్వరలో అమలు చేయనున్న యాంటీ డ్రోన్ సిస్టమ్‌కు సంబంధించిన డెమోను టీటీడీ అధికారులు శుక్రవారం పరిశీలించనున్నారు. తిరుమల భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను అమలుచేయాలని టీటీడీ బోర్డు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో డీఆర్‌డీవో ద్వారా ఇజ్రాయిల్‌కు చెందిన ఓ టెక్నాలజీని టీటీడీ అధికారుల బృందం తిరుమలలోని అన్నమయ్య భవనంలో పరిశీలించనుంది.

అందుబాటులోకి రైల్వే ఓవర్ బ్రిడ్జి



అందుబాటులోకి వచ్చిన మూడు రోడ్ల ఓవర్ బ్రిడ్జి

రేణిగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై, నాయుడుపేట-చిత్తూరు వెళ్లే ఎన్‌హెచ్-205పై తిరుపతి బైపాస్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. జాతీయ రహదారి అధికారులు, రైల్వే అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమన్వయం చేసుకుని ఈ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినట్లు ఎన్‌హెచ్‌ఐ గురువారం ప్రకటించింది. దీంతో ఈ మార్గంలో వాహనాల ట్రాఫిక్ సమస్యకు తెరపడింది.

భక్తురాలి అదృశ్యం



తిరుపతి (నేరవిభాగం), మే 29 (ఆంధ్రజ్యోతి): విష్ణునివాసం వద్ద ఓ భక్తురాలు కనిపించకుండా పోయినట్లు కుటుంబీకులు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన లక్ష్మి (70) కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చారు. ఈ క్రమంలో మతిస్థిమితం సరిగా లేని తమ తల్లి తప్పిపోయారంటూ తార పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈస్ట్ ఎస్‌ఐ హేమాద్రి కేసు నమోదు చేశారు.

కారు డ్రైవర్‌పై ట్రావెల్స్ యాజమాన్యం దాడి



తిరుపతి (నేరవిభాగం), మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ పరిధిలోని దామవాయి రోడ్డులో కారు పార్కింగ్ విషయమై గొడవ జరిగింది. దీంతో కారు డ్రైవరు సునీల్‌కుమార్‌పై ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం దాడి చేయడంతో బాధితుడికి గాయాలయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు బాధితుడు సునీల్ కుమార్ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

14 రోజులు.. 9 చోరీలు

● బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు ● విష్ణునివాసంలో వరుస ఘటనలు

తిరుపతి(నేరవిభాగం), మే 29(ఆంధ్రజ్యోతి): అటు బస్టాండు, ఇటు రైల్వే స్టేషన్.. మరోవైపు మహిళా, ఈస్ట్ పోలీసు స్టేషన్లకు సమీపంలోని విష్ణునివాసంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. గత 14 రోజుల వ్యవధిలో దాదాపు 9 చోరీలు జరిగాయి. మరో చైన్ స్నాచింగ్ చోటు చేసుకుంది. అయినా విజిలెన్సు అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల్లో చాలామంది తిరుపతిలో బసచేసి తిరుమల వెళ్తుంటారు. టీటీడీ వసతి సముదాయాల్లో నిద్రిస్తే కొంతవరకు ప్రశాంతత ఉంటుందనే భావనతో చాలామంది విష్ణునివాసం, శ్రీనివాసం, మాధవం అతిథి గృహాల్లో బస చేస్తుంటారు. బంగారు నగలు, డబ్బు, మొబైల్ ఫోన్లు బ్యాగుల్లో ఉంచి గదుల్లో నిద్రపోతారు. దీన్ని అవకాశంగా మలుచుకుని కొందరు దొంగలు, చైన్ స్నాచర్లు చోరీలకు పాల్పడుతున్నారు. తాజాగా హైదరాబాదుకు చెందిన ఓ మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ఇక, హైదరాబాదు నగరం కూకట్‌పల్లికి చెందిన శ్రీదేవి కుటుంబ సమేతంగా వారం కిందట శ్రీవారిని దర్శించుకుని తిరుపతికి వచ్చారు. రైల్వే స్టేషన్‌కు దగ్గరల్లో ఉన్న విష్ణునివాసంలో గది అద్దెకు తీసుకున్నారు. 16 గ్రాముల బంగారు చైను తీసి బ్యాగులో ఉంచారు. ఉదయం లేచి చూసే సరికి బ్యాగు కనపడలేదు. 10 రోజుల క్రితం తమిళనాడులోని పెరియస్వామికి చెందిన రెండో సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. దీనిపై ఆయన పోలీసు పీజీఆర్‌ఎస్‌లోనూ ఫిర్యాదు చేశారు. ఇలా వరుస ఘటనలు జరుగుతున్నా విజిలెన్సు అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సీసీ కెమెరాల నిఘా ఏదీ?

విష్ణునివాసంలో అవసరమైన చోట్ల సీసీ కెమెరాల నిఘా లేదు.కేవలం భక్తులు లోపలకు వెళ్లే.. బయటకు వచ్చే ప్రాంతం,కౌంటర్ల వద్ద మాత్రమే ఏర్పాటు చేశారు. అవి కూడా మసకబారి సరిగ్గా కనిపించడంలేదని ఇటీవల తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఇక, గదుల వద్ద, లగేజీ సెంటర్ల వద్ద సీసీ కెమెరాలు లేవు.ఇన్ని దొంగతనాలు జరుగుతున్నా ఒకరినీ పట్టుకున్న దాఖలాలు లేవు.దీంతో వరుస చోరీలు జరుగుతూనే ఉన్నాయి.ఇక, తాజాగా బుధవారం రాత్రి మళ్లీ దొంగలు రెచ్చిపోయి విష్ణునివాసంలో 10 మొబైల్ ఫోన్లు,దాదాపు రూ.10,000 కొట్టేశారు. దీనిపైనా పోలీసులు నోరు మెదపడంలేదు. ఇకనైనా ఎస్పీ చర్యలు తీసుకుని వరుస చోరీలకు చెక్ పెట్టే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది.

పల్లికొండేశ్వరాలయ హుండీ లెక్కింపు

సత్యవేడు, మే 29: నాగలాపురం మండలం సురుటుపల్లెలో వెలసిన పల్లికొండేశ్వరాలయ పరకామణిని గురువారం తిరుపతి డివిజన్ దేవదాయ శాఖ తనిఖీ అధికారి పణిరాజశయన, ఈవో పుష్పలత ఆధ్వర్యంలో లెక్కించారు. 67 రోజులకు గాను హుండీ ద్వారా రూ.5,73,453లు, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.44,102లు మొత్తం రూ.6,17,555లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకాళమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో రౌద్రూలి అంకాలమ్మ

నారాయణవనం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళం ఉత్తరంలో వెలసియున్న రౌద్రూలి అంకాలమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం గెరిగెను భక్తి శ్రద్ధలతో గ్రామ పొలిమేర వరకు ఊరేగించారు. అనంతరం అంకాలమ్మకు అభిషేకాలు చేసి నిత్య పూజా కైంకర్యాలు, పూజలు నిర్వహించి, నడివీధిలో ప్రతిష్ఠించారు. పెద్ద ఎత్తున భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తల మీద వేపాకు అలంకరించిన మట్టి దుత్తలను పెట్టుకుని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి నిమజ్జనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి నిమజ్జనంతో జాతర ముగిసింది.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

లేకుంటే 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్న రైతులు

చిత్తూరు సిటీ, మే29(ఆంధ్రజ్యోతి): మామిడికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ఇటీవల కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మామిడి గుజ్జుపరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి.. రైతులవద్ద గిట్టుబాటు ధరతో మామిడి కాయలు కొనుగోలు చేయాలని చెప్పారన్నారు. అయినా ఇంతవరకు గుజ్జు పరిశ్రమలవారు రైతుల వద్ద కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. ఇంకొన్ని రోజులు ఇలాగే ఉంటే తోటల్లోనే కాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. తోతాపురి రకానికి కిలోకు కనీసం రూ.15 నుంచి రూ.20 ఇవ్వాలని కోరారు.సీఎం చంద్రబాబు స్పందించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, లేకుంటే శరణ్యమని వాపోయారు. ప్రభుత్వం స్పందించకపోతే వచ్చేనెల 2వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులు ప్రకాష్, హరిబాబు నాయుడు, బాలాజినాయుడు, రఘునాథ నాయుడు, జయచంద్రనాయుడు, లోకనాథ నాయుడు, దేవరాజులు, చిన్నబ్బ రెడ్డి, శేషాద్రి రెడ్డి, లోక పాల్గొన్నారు.

తిరుపతి



వాహనాలకు జెండా ఊపుతున్న టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ

మహానాడు బహిరంగ సభకు టీడీపీ నేతలు



టీడీపీ జెండా ఊపుతున్న సుగుణమ్మ

తిరుపతి, మే29 (ఆంధ్రజ్యోతి) : మహానాడు ముగింపు సందర్భంగా గురువారం కడపలో జరిగిన టీడీపీ బహిరంగ సభకు తిరుపతి నుంచిపార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. సుమారు 30 బస్సులు, దాదాపు వంద కార్లలో పార్టీ శ్రేణులు ఉదయం 7 గంటలకు కడపకు ర్యాలీకి బయలుదేరి వెళ్లారు. తొలుత పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆమె నివాసం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. 10వ క్లస్టర్ ఇన్‌చార్జి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, 3వ క్లస్టర్ ఇన్‌చార్జి పులుగోరు మురళి ఆధ్వర్యంలో 4 బస్సులు, పలు కార్లలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయకులు ఊకా విజయ్ కుమార్, మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, మునిరాజా, ఆర్సీ శ్రీనివాసులు, గెంజి సుధాకర్ రెడ్డి, జగ్గా, రవితేజ నాయుడు, మణి నాయుడు, నాగ ప్రతాప్, మునిరాజా, రమేష్ రెడ్డిలు బయలుదేరారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న ఏఈవో మునికృష్ణారెడ్డి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు

తిరుపతి అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. జూన్ 2వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ క్రతువును చేపట్టారు. స్వామివారు కొలువు దీరిన సన్నిధితో పాటు ఆలయ ప్రాంగణం, ఇతర ఆలయాల గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను శుద్ధిచేశారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మునికృష్ణారెడ్డి, ప్రధాన అర్చకులు శ్రీనివాస దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

కూల్చేసిన ఇళ్లను పరిశీలించిన తహసీల్దార్



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

తిరుపతి అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): మంగళం వేణుగోపాల్‌కాలనీలో కూల్చేసిన ఇళ్లను అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. తిరుమలనగర్ సచివాలయం పరిధి, చెన్నాయిగుంట గ్రామలెక్కదాఖలు, 218/1సర్వే నెంబర్‌లో 1.64 ఎకరాల్లో నిర్మించుకున్న దాదాపు 55 ఇళ్లను సోమవారం అర్ధరాత్రి ప్రైవేటు వ్యక్తులు కూల్చివేసిన విషయం తెలిసిందే. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన అఖిలపక్ష నేతలు కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతాన్ని సందర్శించిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఇళ్లకు సంబంధించి దస్త్రాల జిరాక్సులను బాధితుల నుంచి స్వీకరించారు. పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

ఇళ్లను కూల్చిన వారిని అరెస్ట్ చేయాలి

తిరుపతి(ఆటోనగర్), మే 29(ఆంధజ్యోతి): కరకంబాడి మార్గంలోని వేణుగోపాల్ కాలనీలో ఇళ్లను కూల్చిన వారిని అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐ నేత సి.పెంచలయ్య, ఆర్పీఐ నేత పి.అంజయ్య డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మాట్లాడుతూ తిరుపతి చరిత్రలో అర్ధరాత్రి ఇళ్లను కూల్చడం జరగలేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించినా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ అకృత్యానికి పాల్పడిన నిర్మల, రాజన్‌బాబు, రమణారెడ్డి, మునిరెడ్డి, మస్తాన్‌తో పాటు రౌడీషీటర్లను అరెస్ట్ చేయకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వేణుగోపాల్, రాధాకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): చిన్నారులపై హత్యాచారాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లా కంబాలదిన్నెలో మూడేళ్ల చిన్నారిపై హత్యాచార ఘటనను ఆయన ఖండించారు. కఠిన శిక్షలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులతో పాటు స్కూళ్లలో చిన్నారులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. కౌమారదశ నాటికే యువకులకు నైతిక విలువలు నేర్పించాలన్నారు. అశ్లీల వెబ్‌సైట్స్‌ను నిషేధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కృష్ణప్రసాద్, బాలిశెట్టి కిషోర్, పగడాల మురళి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం),మే29(ఆంధ్రజ్యోతి):తిరుపతి రూరల్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు...తనపల్లికి వెళ్లే రోడ్డులోని అశోక్ ప్యాలెస్ ముందు మృతదేహం పడి ఉందని గ్రామస్తులు చెప్పారు. శ్రీనివాసపురం పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి కేసు నమోదు చేశారు. బుధవారం ఒక వ్యక్తి హిందీలో మాట్లాడుతూ ఉప్పరపల్లి ఏరియాలో తిరుగుతుండేవాడని చెప్పారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడేవాడని, అయితే అతను ఎలా చనిపోయాడనే విషయం తెలియదని పోలీసులు చెప్పారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



కేంద్రమంత్రి మురుగన్‌ను కలిసిన బీజేపీ నాయకులు

తిరుపతి (ఉపాధ్యాయనగర్), మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన కేంద్రమంత్రి మురుగన్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక పద్మావతి అతిథి గృహం వద్ద బీజేపీ నాయకులు ఆయనను కలిసి, సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దీనికి ముందు పురోహితులు సురేష్ స్వామి వేదాశీర్వాచనం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు నాగోతు రమేష్ నాయుడు, గుండాల గోపీనాథ్, మస్తాన్, ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మల్లారపు రవి ప్రసాద్, ఏబీవీపీ నేత నాగోతు హరి నాయుడు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీలో సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టాలి



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న భానుప్రకాశ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 29(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని బీజేపీ నేత, టీటీడీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. గురువారం ఆయన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఢిల్లీలోని ఆయన స్వగృహంలో కలిసి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నూతన సాంకేతికతతో కూడిన కోర్సులకు రూపకల్పన చేసి వర్సిటీలో ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వర్సిటీలో అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు.

సీపీఎల్ చాంపియన్‌గా హైపీరియన్ జట్టు



సీపీఎల్ చాంపియన్ ట్రోఫీని అందుకుంటున్న హైపీరియన్ జట్టు



రన్నరప్‌గా నిలిచిన పాయ్‌వైస్రాయ్ జట్టు

తిరుపతి(క్రీడలు), మే 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రీమియర్ లీగ్ చాంపియన్‌గా హైపీరియన్ జట్టు నిలిచింది. ఎస్వీయూ మైదానంలో గురువారం మధ్యాహ్నం జరిగిన తుది పోరులో పాయ్‌వైస్రాయ్, హైపీరియన్ జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన పాయ్‌వైస్రాయ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైపీరియన్ జట్టు ఒక్క వికెట్ కోల్పోయి లక్ష్యం ఛేదించింది. సునాయాశంగా విజయం అందుకుని సీపీఎల్ 1సీజన్‌కు చాంపియన్‌గా నిలిచింది. ఈ జట్టు బ్యాట్స్‌మెన్ భవానీప్రసాద్ 68పరుగులు చేసి విజయంలో ప్రధాన భూమిక పోషించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్, సీడీసీఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్(క్రికెట్ విజయ్) విజేత జట్టు ట్రోఫీతోపాటు రూ.2లక్షల నగదు, రన్నరప్ జట్టుకు ట్రోఫీ, రూ.లక్ష, మూడో స్థానంలో నిలిచిన ఆదిత్య జట్టుకు ట్రోఫీ, రూ.50వేలు నగదు అందజేశారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది టోర్నీ ఎ.వి.సూర్య(పాయ్ వైస్రాయ్ జట్టు కెప్టెన్), బెస్ట్ బ్యాట్స్‌మెన్ అభిషేక్‌రెడ్డి-370పరుగులు(ఆదిత్య లెవెన్స్ జట్టు), బెస్ట్ బౌలర్ అనిల్‌కుమార్, బెస్ట్ వికెట్ కీపర్ పృథ్వీరాజ్ (హైపీరియన్ జట్టు), బెస్ట్ ఫీల్డర్ పి.ఎం.వెంకటేష్(పాయ్ వైస్రాయ్ జట్టు), బెస్ట్ క్యాచస్ చరణ్‌జిత్(పాయ్ వైస్రాయ్), కల్యాణ్(ఆదిత్య లెవెన్ జట్టు)అందుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమష్టి కృషితో సీపీఎల్ విజయవంతమైందన్నారు. ఇలాంటి టోర్నీలతో బెస్ట్ క్రికెటర్లు వెలుగులోకి వస్తారన్నారు. గొల్లవాని గుంటలోని క్రికెట్ మైదానాన్ని నూతన హంగులతో నెలరోజుల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. సీడీసీఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీజన్ 1 స్ఫూర్తితో త్వరలోనే సీపీఎల్ 2, అండర్ 12, అండర్ 16లోపు క్రికెట్ క్రీడాకారుల మినీ వరల్డ్ కప్ పేరుతో టోర్నీలు నిర్వహిస్తామని ప్రకటించారు.





దెబ్బతిన్న కాలువలు - కాలువల్లో నిలిచిన మురుగునీరు

సత్యనారాయణపురంలో సమస్యల కొలువు



తిరుపతి(జీవకోన), మే 29(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవకోన సత్యనారాయణపురంలో సమస్యలు కొలువై ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్నాయి. హరేకృష్ణ ఆలయం ఎదురుగా ఉన్న వీధిలో కాలువలు పూర్తిగా దెబ్బతిని మురుగునీరు నిల్వ ఉంటున్నాయి. దుర్వాసన భరించలేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ వీధిలో రోడ్డు కూడా దెబ్బతినడంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంటోంది. రాఘవేంద్రనగర్ సర్కిల్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. దీనికి ప్యాచ్‌వర్క్ చేస్తే ఇబ్బందులు తగ్గుతాయి. పలుమార్లు అధికారులకు, పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాఘవేంద్రనగర్ సర్కిల్‌లో గుంతలమయంగా ఉన్న రోడ్డు

సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

● అధికారులను ఆదేశించిన టీటీడీ ఈవో



తిరుమల, మే29(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో టీటీడీ ప్రాజెక్టులకు సంబంధించి అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. భగవద్గీత సారంశాన్ని పిల్లలు, యువతకు అర్థవంతంగా, సరళంగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్టూన్, వీడియోల రూపంలో అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. హిందూ ధర్మం విశిష్టత, ధార్మిక, ఆధ్యాత్మిక, మానవీయ, నైతిక విలువలను యువతకు తెలియజేప్పేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. పచ్చదనాన్ని మరింత పెంచేలా 'శ్రీవారి నవ నిధి' ద్వారా శ్రీవారి దర్శనానికి వచ్చి వెళ్లే భక్తులకు మొక్కలను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. టీటీడీ వెబ్‌సైట్‌లోని ప్రత్యేక యూట్యూబ్ ఛానల్‌లో అన్నమయ్య సంకీర్తనలన్నీ ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య 32 వేల సంకీర్తనల్లో 14,932 సంకీర్తలు లభ్యమయ్యాయి. అందులో ఇప్పటివరకు ఎన్ని రికార్డు చేశారు, ఇంకా ఎన్ని రికార్డు చేయాల్సి ఉంది, వెబ్‌పేజీల్లో ఎన్ని అప్‌లోడ్ చేశారు వంటి వాటిపై నివేదిక ఇవ్వాలన్నారు.

వ్యర్థాల కాల్చివేతపై కలెక్టర్ ఆగ్రహం

పరిశ్రమ యాజమాన్యానికి రూ.50వేల జరిమానా ● నోటీసు జారీచేసిన డీపీవో



వ్యర్థాల మంటలను ఆర్పిస్తున్న కలెక్టర్

తిరుపతిరూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్‌మండలం గాంధీపురం పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రిలాక్స్‌వెల్ మాట్రిసెస్ పరిశ్రమ వ్యర్థాలను రోడ్డుపక్కనే కాల్చివేయడాన్ని గురువారం ఉదయం అటు వెళ్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు గమనించి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంటలని ఆర్పించి.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పరిశ్రమ యాజమాన్యంపై జరిమానా విధించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. వ్యర్థాలను కాల్చడంతో వెలువడే పొగతో ప్రజలకు అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపక్కన చెత్తవేయడం, కాల్చడం నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై పంచాయతీరాజ్ చట్టం ప్రకారం భారీ జరిమానాలు విధిస్తామన్నారు. లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. భారీ భవనాలు, కట్టడాలు నిర్మించే వారు ఆయా వ్యర్థాలను అనుమతి పొందిన ప్రదేశాల్లో మాత్రమే వేయాలన్నారు. కాగా, రిలాక్స్‌వెల్ మాట్రిసెస్ పరిశ్రమ యాజమాన్యానికి రూ.50వేలు జరిమానా విధించి, నోటీసుని అందించామని డీపీవో సుశీలాదేవి పేర్కొన్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.9 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 29 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలు దొంగలించి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల పాటు జైలు శిక్ష, మరో రూ.9 లక్షల జరిమానా విధిస్తూ గురువారం ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి డివిజన్ నాగపట్ల బీటు పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ ఇద్దరు పట్టుబడ్డారు. స్మగ్లింగ్ నియంత్రించడంలో భాగంగా టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణతో భాగంగా గతంలో నమోదై వివిధ దశల్లో విచారణలో వున్న కేసులకు సాక్ష్యాధారాలను సేకరించి నిందితులకు శిక్షపడేలా ప్రణాళికలు రూపొందించారు. దీనిలో భాగంగా క్రైం నెంబరు 1-2017 మేరకు అప్పట్లో ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడిన చంద్రగిరి మండలానికి చెందిన గౌస్‌బాషా, శివపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు. ముద్దాయిలను నెల్లూరు జైలుకు తరలించారు.

సానిపాయి అటవీ రేంజ్‌లోకి ఏనుగులు



దాడి అనంతరం అడవిలోకి వెళుతున్న ఏనుగు

ఎర్రావారిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులపై దాడికి పాల్పడిన గజరాజులు అన్నమయ్య జిల్లా సానిపాయి అటవీశాఖ రేంజ్ పరిధిలోకి వెళ్లినట్లు అధికారులు భావిస్తున్నారు. ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద పంచాయతీ బోయపల్లె వద్ద ఏనుగులను అడవిలోకి దారి మళ్లిస్తున్న టాస్క్‌ఫోర్స్‌పై తిరగబడటంతో.. తమ ప్రాణాలు కాపాడుకొనే క్రమంలో ఇద్దరు అధికారులు గాయపడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఏనుగులు డ్రోన్‌లకూ చిక్కలేదు. దీంతో సానిపాయి రేంజ్‌లోకి వెళ్లాయని అంచనా వేస్తున్నారు. కాగా, అధికారులపైకి దూసుకొచ్చిన తర్వాత అడవిలోకి వెళ్తున్న ఏనుగులను డ్రోన్ గుర్తించి ఫొటోలు తీసింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, ప్రభుత్వ విప్ గణబాబు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సినీనటి వాసుకీ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



తిరుచానూరు, మే 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయంవద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. జస్టిస్ కృష్ణమోహన్‌కు ఆలయ పండితులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

'పీఎం సూర్యఘర్' లక్ష్యాలను పూర్తి చేయండి

తిరుపతి(ఆటోనగర్), మే29 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం (రూఫ్‌టాప్ సోలార్ పథకం) లక్ష్యాల మేరకు నిర్ణీత సమయంలో అమలు చేయాలని సీఎస్ విజయానంద్ విద్యుత్ కంపెనీల అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం ఆయన మూడు కంపెనీల అధికారులతో టెలికాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ప్రతి నియోజక వర్గంలో 75 వేల కనెక్షన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ నెలాఖరులోపు నిర్ణయించిన లక్ష్యం మేరకు ఈ పథకం పూర్తి చేయాలన్నారు. సదరన్ డిస్కంలో ఇప్పటి వరకు 4700 కనెక్షన్లు పూర్తి చేశామని ప్రాజెక్టుల విభాగం డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్ తెలిపారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టర్లు కె.గురవయ్య, వై.లక్ష్మీనరసయ్య, సీజీఎంలు రమాదేవి, జానకిరామయ్య, ఆదిశేషయ్య పాల్గొన్నారు.



మూడేళ్ల ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో చూడాలని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు. రీ వాల్యుయేషన్ కోసం జూన్ 9 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

సంస్కృత వర్సిటీలో దూరవిద్యకు దరఖాస్తుల ఆహ్వానం

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూరవిద్యా విభాగంలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమో, ప్రాక్ శాస్త్రి కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 8 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం కోసం.. 94402 26562 నెంబరులో సంప్రదించాలని ఆ వర్సిటీ దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాథ్ కోరారు.

ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఎన్‌బీఏ గుర్తింపు



ఎన్‌బీఏ గుర్తింపు ధ్రువీకరణ పత్రంతో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహిస్తున్న పలు కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఇంజనీరింగ్ కాలేజీ పాటిస్తున్న బోధన, ఫలితాలు, సదుపాయాలు, ప్రమాణాలను ఈ నెల 7 నుంచీ మూడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ గుర్తింపు ప్రకటించారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాల ప్రగతిని ఎన్‌బీఏ బృందం అధ్యయనం చేసి ఈ గుర్తింపు ప్రకటించింది. దీనిపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ వెంకట్రామయ్య, డీన్ దామోదరరెడ్డి, ప్రొఫెసర్ రమాశ్రీ, ఇంజినీరింగ్ కాలేజీ అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఇంతకీ ఏం జరిగింది?

- నాయుడుపేట లాడ్జీలో ఇద్దరి మృతి
- యువకుడి మెడ కోసి ఉండటంతో అనుమానాలు
- యువతి ఉరేసుకుని ఆత్మహత్య
- అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు



లాడ్జీవద్ద రోదిస్తున్న శిరీష కుటుంబీకులు

నాయుడుపేట టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. ఆమె భర్తతో విడిపోయింది. అతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాంటిది.. మణి(35), శిరీష (25) మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఏం జరిగిందో ఏమోగానీ.. గురువారం నాయుడుపేటలోని లాడ్జీలో ఇద్దరూ మృతిచెందారు. అతడి గొంతు కోసి ఉండగా.. ఆమె ఉరేసుకుంది. అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం గ్రామానికి చెందిన మణికి పెళ్లయింది. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇక, శిరీషను చిన్నప్పుడే ఆమె తల్లి విజయమ్మ కుప్పారెడ్డిపాళెంలో నాయనమ్మ గురవమ్మ, లాజరస్ దంపతులకు అప్పగించింది. వాళ్లు పెంచి శ్రీకాళహస్తి సమీపంలోని సమీప బంధువుకు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలం తరువాత ఆమె విడాకులు తీసుకొని కుప్పారెడ్డిపాళెంలో నాయనమ్మ దగ్గర ఉంటుంది. ఈ క్రమంలో మణితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో మణి ఇంట్లో గొడవలు రేగాయి. కొద్ది రోజుల కిందట అతడి భార్య పుట్టింటికి అలిగివెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో మణి, శిరీష నాయుడుపేట బస్టాండు సమీపంలోని ఓ లాడ్జీలో గదిని అద్దెకు తీసుకున్నారు. గురువారం ఉదయం 8.30 గంటల సమయంలోనూ లాడ్జీ సిబ్బందితో మాట్లాడారు. ఆ తర్వాత గదిలోకి వెళ్లిన వీరు.. ఎంతసేపటికీ బయటకు రాలేదు. అనుమానం వచ్చిన సిబ్బంది కిటికిలో నుంచి చూడగా శిరీష ఉరేసుకుని.. మణి గొంతుకోసుకొని అధిక రక్తస్రావంతో పడి ఉండటాన్ని గుర్తించారు. వీరి సమాచారంతో డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబీ, ఎస్‌ఐ నాగలక్ష్మి మృతదేహాలను పరిశీలించారు. అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశారు.

ఎన్నో అనుమానాలు?

మణి గొంతు కత్తితో చాలా లోతుగా తెగిఉండటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనే కోసుకుని ఆత్మహత్య చేసుకొని ఉంటే అంతలోతుగా తెగి ఉండదని భావిస్తున్నారు. వాష్ బేసిన్లో రక్తపు మరకలు ఉండటంతో.. ఇక్కడ చేతులు కడిగి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఉరేసుకుని చనిపోయిన శిరీష చేతికీ రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించారు. దీంతో వీరిద్దరి మధ్య ఏం జరిగిందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఆ గదికి గడియ వేసుండటంతో మూడో వ్యక్తి వచ్చిపోయే అవకాశం లేదు. అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణకు 'యోగా'

మంగళం/తిరుపతి(క్రీడలు/కలెక్టరేట్), మే 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరు యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని, యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం తిరుపతిలోని ఎస్వీ జూపార్కు వద్ద యోగా శిక్షణ నిర్వహించారు. ప్రతి ఒక్కరు మరో నలుగురితో యోగా చేయించాలన్నారు. ఇప్పటి వరకు గుర్తించి మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఈనెలాఖరు వరకు శిక్షణ కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ శుభంబన్సల్, జూ క్యూరేటర్ సెల్వం, డీఎఫ్‌వో వివేక్ వివిధ విభాగాల అధికారులు రామ్మోహన్, విక్రమ్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణనాయక్, జనార్దన్‌రెడ్డి, చరణ్‌తేజ్ రెడ్డి, సిబ్బంది యోగాసనాలు వేశారు. సాయంత్రం కలెక్టర్, జేసీ, కమిషనర్ మౌర్య యోగాంధ్ర నిర్వహణ, యోగాంధ్ర యాప్‌లో నమోదుపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. యాప్‌లో పది లక్షలమంది నమోదుకు లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 1.30 లక్షలు మాత్రమే నమోదవడం అసంతృప్తి వ్యక్తం చేశారు.





జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), మే 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువును మరో మూడు నెలలు పొడిగించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనున్న నేపథ్యంలో ఆగస్టు 31 వరకు పొడిగించనున్నట్లు పేర్కొన్నారు. మీడియా సంస్థలో జర్నలిస్టుల వివరాలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో త్వరగా అందజేయాలన్నారు.







సభలో అమ్మాయిల ఉత్సాహం



మహానాడు వేదిక



సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు


మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం







జక్కా వెంకయ్యకు నివాళి


వెంకయ్యకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్‌కె రియాజ్ ఆధ్వర్యంలో వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. రియాజ్ మాట్లాడుతూ వెంకయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అల్లెయ్య, సీహెచ్ చంద్రశేఖర్, సుధాకర్ రావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో జక్కా వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో శివకుమార్, వెంట్రామిరెడ్డి, బీవీరమణయ్య, కోటేశ్వరరావు, మణి, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు సరుకుల చేరవేత



సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో అధికారులు చౌక దుకాణాల నుంచి డీలర్ల ద్వారా రేషన్ సరకులను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సూళ్లూరుపేట సివిల్ సప్లయ్ గోదాం నుంచి రేషన్ సరకులను ఆయా చౌక దుకాణాలకు వాహనాల ద్వారా చేర్చుతున్నారు. సూళ్లూరుపేట సివిల్ సప్లయ్ పరిధిలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో 121 చౌక దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికే 80 చౌక దుకాణాలకు రేషన్ బియ్యం, చక్కెర అందజేసినట్లు సివిల్ సప్లయ్ గోదాం ఇన్‌చార్జీ తులసిరామ్ తెలిపారు. కందిపప్పు రాగానే అందజేస్తామన్నారు.

పాఠశాలకు వాటర్‌కూలర్ వితరణ



గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూలతోట గిరిజన కాలనీలోని సరస్వతి శిశు మందిరం పాఠశాలకు గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో హనుమంతరావు వాటర్‌కూలర్‌తో పాటు పలు వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, మునిగిరీష్, జీజీనాయుడు, మయూరి శ్యామ్‌యాదవ్, మురళీరెడ్డి, హనుమంతరావు, శశిధర్, రమణబాబు, దశరధరామిరెడ్డి, రంగనాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యతా యాత్ర



గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యతాయాత్రను నిర్వహించారు. సీపీఎం కార్యాలయం నుంచి వివేకానందారోడ్డు, ముత్యాలపేట మీదుగా టవర్‌క్లాక్‌సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. శివకుమార్, బీవీ.రమణయ్య, వెంకట్రామిరెడ్డి, మణి, ప్రసాద్, మధు, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, నారాయణ, చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఇంటిదొంగ


సబ్‌స్టేషన్ వద్ద పట్టుబడిన స్క్రాప్ ఆటో

గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): నెల్లటూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ స్క్రాప్‌ను అక్రమంగా ఓ ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నారు. స్థానికుల వివరాల మేరకు... సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు షిఫ్టు ఆపరేటర్‌గా పని చేస్తున్న నవీన్ బుధవారం అర్ధరాత్రి విద్యుత్‌స్టోర్స్‌కు చెందిన స్క్రాప్‌ను ఆటోలో అక్రమంగా తరలిస్తున్నాడు. వ్యాచ్‌మన్లు చూసి ఆటోను పట్టుకుని బాధ్యులైన అధికారులకు తెలియజేశారు. విధులు నిర్వహించే సిబ్బందే ఇలాంటి చర్యలకు పాల్పడటంపై స్థానికులు విస్తుపోన్నారు. విద్యుత్‌స్టోర్స్ ఏడీ శంకరయ్యను వివరణ కోరగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పూర్తి స్థాయిలో విచారిస్తామన్నారు. చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తాం


అధికారులతో మాట్లాడుతున్న వెంకటరమణ

వెంకటగిరిటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలోనే సుందరీకరిస్తామని ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ(విజయవాడ)అన్నారు. గురువారం స్థానిక బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో పెయింట్, బస్టాండ్ మరమత్తులు, మరుగుదొడ్లు, కుర్చీలు, ఫ్యాన్స్ వంటివి చేయించి ఆధునీకరిస్తామన్నారు. మరిన్ని ఆర్టీసీ సర్వీసులను నడుపుతామమన్నారు. కార్యక్రమంలో తిరుపతి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెన్నకేశవ, ఆర్టీసీ డిపో మేనేజరు రామకృష్ణ, ఏఈ కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్నదర్గా ఉరుసు



నాయుడుపేట టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నదర్గా ఉరుసును వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు గురువారం విద్యుత్ దీపాలంకరణలో ఉన్న చిన్నదర్గాలో పలువురు మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఊరేగింపుగా గంధం తెచ్చి చిన్నదర్గా వద్ద చదివింపులయ్యాక అందరికీ పంచిపెడతారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): హోలిక్రాస్ సర్కిల్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు తడ మండలం వేనాడుమూల గ్రామానికి గూటాం చిన్నయ్య (45) సూలూరుపేట హోలిక్రాస్ సమీపంలోని రైస్‌మిల్లులో ఒడ్లు దంపించేందుకు ఆటోలో ధాన్యం బస్తాలను పంపాడు. వెనుక మోటారు సైకిల్‌పై అనుసరించాడు. హోలిక్రాస్ సర్కిల్ జాతీయ రహదారిపై చెన్నైవైపు వెళ్లే మినీలారీ ఇతడిని ఢీకొంది. చిన్నయ్య ఎగిరి డివైడర్‌పై పడడంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి చెన్నై తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో జరగనుంది. మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. మున్సిపాలిటీ కమిషనర్ కె.చిన్నయ్య ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు.

సుందరకాండ యాగ పూజలు



గూడూరు అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉప పీఠంలో గురువారం సుందరకాండ యాగ హోమపూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆంజనేయస్వామి సుందరకాండ యాగాన్ని నిర్వహించామన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో నిషాన్



గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గావీధిలోని హజరత్‌సయ్యద్ హషీమ్ హుస్సేనీ ఔలియా దర్గాలో బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిషాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిషాన్ జెండాను ఊరేగించి దర్గా వద్ద ఆవిష్కరించారు. మత గురువులు, ముస్లింలు ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో రియాజ్‌అహ్మద్, మగ్దూం, ఇలియాజ్‌అహ్మద్, షాన్‌వాజ్, యస్థానీ, సందానీ, దిల్‌దార్, కమర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో



వెంకటగిరిటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా రైల్వేస్టేషన్ వెళ్తున్న ఆటో కౌవల్యానది కాలవులోకి దూసుకెళ్లింది. స్థానికులు కథనం మేరకు. గురువారం నది పాత బ్రిడ్జి రోడ్డుపై ఆటో రైల్వే స్టేషన్‌కు వెళ్తుంది. ఈక్రమంలో మద్యం తాగి ఉన్న డ్రయివర్ ఆటోను స్టార్ట్ చేసి రోడ్డుపక్కన ఉంచాడు. దీంతో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎస్ఐ సుబ్బారావు అక్కడకు చేరుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

ఉర్దూ తరగతుల నిర్వహణకు ఆదేశాలు

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల, వాకాడులోని ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఉర్దూ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించుకోవాలని డీఈవో కేవీఎస్ కుమార్ ఆదేశించారని ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. ఈ పాఠశాలల్లో ఇటీవల రేషనలైజేషన్‌కింద 3,4,5 తరగతులను ఎత్తేశారు. ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ దృష్టికి టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ తీసుకువచ్చారు. ఎమ్మెల్యే చొరవతో తిరిగి తరగతులు పునరుద్ధరణతోపాటు ఉర్దూ ఉపాధ్యాయుల నియామకానికి అనుమతి లభించిందని మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు.. జూన్‌2న పలు రైళ్ల రద్దు

తడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : సదరన్ రైల్వే పరిధిలో శనివారం, జూన్ 2న పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు చెన్నై డివిజన్ సదరన్ రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, గుమ్మిడిపూడి, కవర్‌పేట రైల్వే స్టేషన్‌ల మధ్య ఇంజనీరింగ్ సిగ్నల్ వ్యవస్థ మాక్ పనులు జరుగుతున్న క్రమంలో ఈమేరకు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. కొన్ని రైళ్లను చెన్నై, మీజూరుల మధ్య నడపనున్నారు.

రద్దయిన రైళ్ల వివరాలు

- చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వచ్చే ఈఎంయూ
- సూళ్లూరుపేట- చెన్నై మెము, ఈఎంయూ
- సూళ్లూరుపేట-నెల్లూరు(66037) మెము
- నెల్లూరు-సూళ్లూరుపేట(66038) మెము.
- చెన్నై- గుమ్మిడిపూడి ఈఎంయూ
- గుమ్మిడిపూడి-చెన్నై ఈఎంయూ

కల్వర్టుల విస్మరణతో ముంపు ముప్పు



మూసివేసిన కల్వర్టు ఎదురు రోడ్డువైపు కల్వర్టు నిర్మాణం- నిరుపయోగమైన కల్వర్టు

నాయుడుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-తిరుపతి జాతీయ రహదారిలో నాయుడుపేట సర్కిల్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించినా గతంలో అక్కడ ఉన్న కల్వర్టులను విస్మరించారు. ఒక కల్వర్టు పూర్తిగా మూసివేయగా దానికి ఎదురుగా ఉన్న రహదారి వద్ద కల్వర్టు నిర్మించారు. మరోచోట కల్వర్టు నిరుపయోగంగా, చిన్నదిగా నిర్మించారు. అక్కడ నుంచి నీరు వెళ్ళే మార్గం లేకుండా రోడ్డుకు మరోవైపు పూర్తిగా మూసివేశారు. గతంలో ఉన్న పైపులైన్లనూ తీసివేశారు. వర్షాలు వస్తే నాయుడుపేట-విన్నమాల హైవే సర్కిల్ వద్ద ఉత్తరం వైపు పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులకు తెలిపినా చర్యలు చేపట్టలేదని స్థానికులు, రైతులు వాపోతున్నారు. విన్నమాల హైవే సర్కిల్ వద్ద డీఎస్పీ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, డివిజనల్ సబ్ ట్రెజరీ, తహసీల్దారు వంటి కార్యాలయాలు కూడా ఉన్నాయి. భారీ వర్షాలు వస్తే ఈ ప్రాంతంలో పంట మునిగిపోయే ప్రమాదం ఉంది. పాత కల్వర్టుల ద్వారా నీరు పారేలా చూడాలని కోరుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం


క్యాన్సర్ పరీక్ష చేస్తున్న డాక్టర్

బాలాయపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం అందిస్తే నివారణ సాధ్యమవుతుందని వైద్యాధికారి లియోనా అన్నారు. గురువారం గొట్టికాడు, నిండలి పంచాయతీల్లో తిరుపతి సిమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొమ్ముక్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలలో నివారించవచ్చునన్నారు. 35 ఏళ్లు దాటిన ప్రతిమహిళ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవడం మంచిదన్నారు. సుమారు 100 మందికి పరీక్షలను నిర్వహించారు. జూన్ న జయంపు, పెరిమిడి గ్రామాల్లో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు హరిత, చైతన్యభాను, సర్పంచులు కృష్ణయ్య, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

స్వర్గధామం అభివృద్ధి పనులకు రూ.4లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న శ్రీనివాసులు

నాయుడుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట హిందూ స్మశానవాటిక స్వర్గధామం అభివృద్ధి పనుల కోసం సోల్లేటి శ్రీనివాసులు గురువారం రూ.4 లక్షలు హిందూ ధర్మసేవాసంఘం కన్వీనర్ కామిరెడ్డి రాజారెడ్డి, నాయకులకు అందజేశారు. తన భార్య ప్రవీణ జ్ఞాపకార్థంగా నగదు అందజేస్తున్నట్లు శ్రీనివాసులు తెలిపారు. ఈ సొమ్ముతో అదనపు గదిని నిర్మించనున్నట్లు హిందూ ధర్మసేవా సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో హిందూ ధర్మసేవాసంఘ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, పీడీ ఉదయశంకర్, కృష్ణారావు, శశిధర్, చంద్రారెడ్డి, ఎస్. కుమార్, కోటేశ్వరరావు ఉన్నారు.

యోగా చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ


ప్రతిభ కనపరచిన విద్యార్థులతో ఎంఈవో మునిరత్నం

నాయుడుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రలో భాగంగా గురువారం అన్నమేడులో విద్యార్థులకు పలు ఆసనాలను యోగా శిక్షకుడు విద్యార్థులకు నేర్పించారు. ఆసనాలపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఎంఈవో మునిరత్నం అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, యోగా శిక్షకుడు ఎస్ సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, సరసమ్మ, కార్యదర్శి చిట్టేటి గోవిందమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : పట్టణంలో గురువారం ప్రజలకు యోగా ఉపయోగాల గురించి అధికారులు వివరించారు. యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు కూడా నియంత్రించవచ్చునని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా చెప్పారు.

రేషన్ దుకాణాల ఆకస్మిక తనిఖీ


రేషన్ దుకాణంలో తనిఖీచేస్తున్న తహసీల్దార్

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుపల్లి కొత్తపాళెం, చెందోడు, జరుగుమల్లి, కొక్కుపాడు, తిమ్మానాయుడుపాళెం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను గురువారం తహసీల్దార్ జయజయరావు తనిఖీ చేశార్లు, వస తులు, కాటాల కొలతలను స్వయంగా పర్యవేక్షించి డీలర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావు, వీఆర్‌ఓలు ఉన్నారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో డీలర్లు, వీఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. **తడ** : అవకతవకలు తావివ్వకుండా పక్కాగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దారు శరత్‌బాబు ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తూకం యంత్రాలు, బయోమెట్రిక్ మిషన్లు పక్కాగా ఉంచుకోవాలన్నారు. సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య, వనజ, వీఆర్వోలు పాల్గొన్నారు.

భూసేకరణపై జేసీ బన్సల్ ఆరా


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇరగలం, రాళ్లకుప్పం గ్రామాల్లో భూ సేకరణ పై జేసీ శుభం బన్సల్ గురువారం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో చర్చించారు. ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో భూ సేకరణ సత్యవేడు తహశీల్దార్ రాజశేఖర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సజావుగా సేకరించాలన్నారు. ఈ సందర్భంగా జేసీకి అంబేడ్కర్ సేవా సమితి సూళ్లూరులో సర్వే నెంబరు93/31లొ 1965 నుంచి నివాసం ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికేట్స్ ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని ఆయన వారికి హామి ఇచ్చారు. తహశీల్దార్ ఎస్‌వీ నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి నివాళి

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస సత్రం సమీపాన సముద్రంలో గల్లంతై మృతి చెందిన 7వ తరగతి విద్యార్థిని పల్లవి మతదేహం వద్ద గురువారం గూడూరు బీసీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ అంజనమ్మ, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. ఎర్రావారిపాళెం మండలం ఉదయ మాణిక్యం బీసీ బాలికల గురుకులంలో 7వ తరగతి చదువుతున్న పల్లవి బుధవారం స్వగ్రామం శ్రీనివాససత్రం వచ్చి ప్రమాదవశాత్తు సముద్రంలో దిగి మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆమె తల్లిదండ్రులు లక్ష్మయ్య, సౌమ్యలకు ఉపాధ్యాయులు ధైర్యం చెప్పారు.

తేనెటీగల దాడి

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని బజాజ్ షోరూం సెంటర్‌లో గురువారం కొండ తేనేటీగలు పాదచారులపై దాడి చేశాయి. రెండు రోజులుగా ఈ ప్రాంతంలో ఇవి దాడి చేస్తుండడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. ఇక్కడ చెట్లపై తేనేటీగ తొట్టెలు ఎక్కువగా ఉండడంతో అక్కడ ఈగలు వాహన చోదకులపై తెగబడుతుండటంతో బాధితులు చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు.

కోటమ్మకు గోదానం

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : కోట గ్రామ దేవత కోటమ్మకు గురువారం పట్టణానికి చెందిన ప్రసాద్ గోవును దానం చేశారు. ఆలయ ధర్మకర్త నల్లప్పరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి,కవితమ్మ దంపతులకు గోవును అప్పగించారు. ఆలయంలో గోపూజ చేశారు.

పంటకాలువ పూడికతీత


పనులను పర్యవేక్షిస్తున్న ఫజులుల్లా

నాయుడుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విన్నమాల పంటకాలువ పూడికతీత పనులను గురువారం చేపట్టారు. పంటకాలువ దాదాపు ఎక్కువ ప్రాంతం పట్టణంలో ఉండటంతోపాటు స్వర్ణముఖినది నుంచి నీటి పారుదల సక్రమంగా లేకపోవడంతో మురికికూపంలా తయారైంది. ఈక్రమంలో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులను చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పర్యవేక్షించారు.

చెంగాళమ్మ సేవలో హైకోర్టు ప్రధాన కార్యదర్శి


హైకోర్టు ప్రధాన కార్యదర్శికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని గురువారం ఏపీ హైకోర్టు ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆయనకు సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో పూజలనంతరం ఆస్థాన మండపంలో వేధపండితుల ఆశీర్వచనంచేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

మహానాడుకు ఉత్సాహంగా తరలిన టీడీపీ శ్రేణులు

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు గురువారం సూళ్లూరుపేట నుంచి టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. పట్టణం, రూరల్ కమిటి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆరు బస్సుల్లో వెళ్లారు. టీడీపీ నాయకులు సుబ్రమణ్యం, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, ఏలిమేటి సతీష్, వంకా రమేష్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుకు కొక్కు శంకరయ్య ఆధ్వర్యంలో తెల్లవారుజామున గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లారు.

నాయుడుపేట : గోమతి సెంటర్ వద్ద మహానాడుకు టీడీపీ శ్రేణులు వెళ్తున్న వాహనాలకు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నెలవల రాజేష్, మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్‌ప్రసాద్, దార్ల రాజేంద్ర, అవధానం సుధీర్, మైలారి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

గూడూరు: మహానాడు బహిరంగసభకు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 60 బస్సులు, 40 టెంపోలు, కార్లు, ఇతర వాహనాల్లో 5వేల మంది తరలివెళ్లారు. చిల్లకూరు మండలం నుంచి టీడీపీ సీనియర్ నాయకులు తానంకి నానాజీ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు.

ఓజిలి: మండలం నుంచి వందలాదిగా తెలుగు తమ్ముళ్ళు మహానాడుకు కదిలారు. మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు అధ్వర్యంలో ఓజిలి క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య నేతృత్వంలో ఓజిలితోపాటు మండలం నుంచి పసుపు సైన్యం బయలుదేరింది. **బాలాయపల్లి:** మండలపార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు ఆధ్వర్యంలో 10 బస్సులు 5 కార్లలో బయలుదేరి వెళ్లారు. **పెళ్లకూరు** : మహానాడు సభకు టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో వాహనాల్లో పార్టీ శ్రేణులు వెళ్లాయి. మహానాడు ప్రాంగణంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని నాయకులు, కార్యకర్తలు కలిశారు. సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంపై ఎమ్మెల్యే అభినందించారు.






మహానాడు సభ వద్ద ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో తెలుగు యువత నాయకులు-చిల్లకూరు నుంచి వెళుతున్న టీడీపీ నేతలు- ఎమ్మెల్యే విజయశ్రీతో పెళ్లకూరు మండల టీడీపీ నాయకులు- మహానాడుకు బయలుదేరిన ఓజిలి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పాకశాస్త్ర వర్సిటీలో డీజీఆర్ ట్రైనీలకు వీడ్కోలు



రేణిగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ పాకశాస్త్ర వర్సిటీలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీ సెటిల్మెంట్ (డీజీఆర్)లో శిక్షణ పొందిన వారికి కలెక్టర్ వెంకటేశ్వర్ వీడ్కోలు పలికారు. రేణిగుంట మండలం జిపాళ్యం పంచాయతీలోని విశ్వవిద్యాలయంలో అవుట్ గోయింగ్ బ్యాచ్‌కు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వీరిని కలెక్టర్ అభినందించారు. వసతి, టూరిజం రంగంలో వారికి గొప్ప రెండవ కెరీర్‌ను కోరుకుంటున్నారన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ ఎం. తిరులోగ చందర్ పాక శాస్త్ర విద్యాయలం అందించే కోర్సులు, వసతి, టూరిజం పరిశ్రమలో విద్యార్థులకు అవకాశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అన్ని వంటశాలలు, ప్రయోగశాలను కలెక్టర్ సందర్శించి కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో పాక శాస్త్ర విశ్వవిద్యాలయం అధికారులు, సిబ్బంది శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు జనని మిత్ర యాప్‌ను వినియోగించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్ వెల్లడి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

రేణిగుంట, మే 29(ఆంధ్ర జ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు జనని మిత్ర యాప్‌ను వినియోగించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనని మిత్ర యాప్ గురించి గర్భిణులకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి వారి పర్యవేక్షణను సులభతరం చేయడానికి ప్రభుత్వం జనని మిత్ర యాప్‌ను పరిచయం చేసిందని తెలిపారు. గర్భిణులు వారి వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో హైమావతి, సూపర్‌వైజర్లు నాగరాజు, కామరాజు, అనురాధ, ఆశ వర్కర్లు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం వికసిత్ కృషి సంకల్ప లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఆర్‌ఐడీఏ శాస్త్రవేత్త భరత్‌కుమార్

సత్యవేడు, మే 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునికతను జోడించి రైతు సాధికారత సాధించడమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ లక్ష్యమని సీఆర్‌ఐడీఏ శాస్త్రవేత్త భరత్‌కుమార్ తెలిపారు. మండలంలోని పుదుకుప్పం, మదనంబేడు, బాలకృష్ణాపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త భరత్‌కుమార్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో స్థిరమైన పద్ధతులు, శాస్త్రీయతపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా సరైన మోతాదులో మాత్రమే ఎరువులు, మందులు వినియోగించాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త సుధాకర్ మామిడి, పూల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ సుబ్రమణ్యం, ఏవోలు మురళి, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అందుబాటులోకి మూడు రోడ్ల ఓవర్ బ్రిడ్జి



రేణిగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై, నాయుడుపేట-చిత్తూరు వెళ్లే ఎన్‌హెచ్-205పై తిరుపతి బైపాస్‌లో మూడు రోడ్ల ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. జాతీయ రహదారి అధికారులు, రైల్వే అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమన్వయం చేసుకుని ఈ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినట్లు ఎన్‌హెచ్‌ఐ గురువారం ప్రకటించింది. దీంతో ఈ మార్గంలో వాహనాల ట్రాఫిక్ సమస్యకు తెరపడింది.

పుత్తూరు వార్తలు

వైభవంగా మహా రుద్రాభిషేకం



విశేష అలంకారంలో మహాశివుడు

వడమాలపేట, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీ శంకర దేవాలయంలో మహాశివుడి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా గురువారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం సదాశివుడి మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో రుద్ర హోమం, శాంతి హోమం చేశారు. మహాశివుడి లింగాన్ని పూలమాలాలతో అలంకరించి, మంగళ హారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

మహానాడుకు వెళ్లిన టీడీపీ శ్రేణులు



వడమాలపేట నుంచి మహానాడుకు వెళుతున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో మహానాడు బహిరంగసభకు మండలం నుంచి భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సుమారుగా 400 మంది ఆరు బస్సులు, పలు వాహనాల్లో మహానాడుకు వెళ్లారు.

గుజరి వ్యాపారుల నూతన కార్యవర్గం



పుత్తూరు టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): గుజిరి వ్యాపారుల నూతన సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం గోవిందపాలెం బైపాస్‌లో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సర్దార్ శివ, గుజరి సంఘం జిల్లా కన్వీనర్ అల్లాబక్ష, పుత్తూరు డివిజన్ నాయకులు మహేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమితి గౌరవాధ్యక్షుడిగా మహేష్, అధ్యక్షుడిగా శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా దావత్‌బాయ్, కోశాధికారిగా పెరుమాల్, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శిగా ఆర్ముగం, కమిటీ సభ్యులుగా రాము, శ్రీరాములు, దాము, సురేంద్ర, అన్నామలై తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జూన్ 20వ తేదీన తిరుపతిలో గుజరి వ్యాపారుల సంఘం మొదటి మహాసభ జరగనున్నదని, అక్కడ గుజరి వ్యాపారుల సమస్యల పరిష్కారంకోసం చర్చించనున్నట్లు తెలిపారు. గుజరి వ్యాపారస్తులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మహానాడులో ఎమ్మెల్యే సందడి



మహానాడులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, మే 29(ఆంధ్రజ్యోతి): మహానాడు బహిరంగ సభ సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సందడి చేశారు. ఐదు రోజుల క్రితం నుంచే మహానాడు ఏర్పాటు పనులపై కడపకు చేరుకుని నిమగ్నమయ్యారు. గురువారం చివరిరోజున ఎమ్మెల్యే రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పసుపు పండుగను సంబరంగా జరిపారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, మే 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముక్కంటి సేవలో సినీనటి శ్రియ



శ్రీకాళహస్తి, మే 29 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ప్రముఖ సినీ నటి శ్రియ శరణ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, బీజేపీ నాయకులు కొండేటి గోపాల్, చందురాయల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎస్వీ యూనివర్శిటీ జంతుశాస్త్రం విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం శ్రీనివాసులరెడ్డి కుమారుడు ఎంవీ యశ్వంత్ పవన్ కల్యాణ్ మీద అభిమానంతో తన సొంత నిధులతో అన్నదానం చేశారు. వారికి కోట వినుత అభినందనలు తెలిపారు. జనసేన నాయకులు రవికుమార్‌రెడ్డి, పేట చిరంజీవి, వెంకటరమణ యాదవ్, శ్రీను, ఉదయ్, మునికుమార్, దినేష్, రాజా, సాయి, మునిచంద్ర, శారద, గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు ప్రతి ఒక్కరికీ అందాలి

బుచ్చినాయుడుకండ్రిగ, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్ సరకులు అందరికీ అందేవిధంగా డీలర్లు కృషి చేయాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జూన్ నెల నుంచి డీలర్ల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు మాత్రం ఇంటి వద్దకే సరుకులు అందజేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర ప్రతి కార్డుదారుడికి తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

ఏర్పేడు వైసీపీ అధ్యక్షుడిగా రమణయ్యయాదవ్

ఏర్పేడు, మే 29(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండల వైసీపీ మండలాధ్యక్షుడిగా కూనాటి రమణయ్య యాదవ్ రెండోసారి నియమితులయ్యారు. గురువారం మండల కమిటీ నియామక ఉత్తర్వుల జాబితాను విడుదల చేశారు.

ఇద్దరు ముక్కంటి ఆలయ ఉద్యోగులకు అంతర్గత బదిలీ

శ్రీకాళహస్తి, మే 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులను పరస్పరం అంతర్గతంగా బదిలీ చేశారు. ఆలయం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జూనియర్ హరిబాబును ప్రసాదం పోటుకు బదిలీ చేశారు. ఆలాగే ప్రసాదం పోటులో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామికి ఇన్‌స్పెక్టర్ విధులు కేటాయించారు. ఈ మేరకు గురువారం ఈవో బాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రాఫిక్ ఎస్‌ఐగా గోవిందు

శ్రీకాళహస్తి, మే 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణ ట్రాఫిక్ విభాగం ఎస్‌ఐగా సీహెచ్ గోవింద్‌ను నియమించారు. శ్రీకాళహస్తి బాంబ్ స్క్వాడ్ విభాగంలో విధులు నిర్వహించిన ఆయన గురువారం నుంచి ట్రాఫిక్ విభాగానికి కేటాయించారు. ఏఆర్‌ఎస్‌ఐగా గోవిందు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లను గురువారం పరిశీలించారు. ట్రాఫిక్ ఆంక్షల అమలుపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్ పంపిణీ

వరదయ్యపాలె, మే 29(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలోని పాండూరు పంచాయతీకి చెందిన కోదండరామ గ్రూప్ రైతులకు డ్రోన్ స్ప్రేయర్ ప్రభుత్వం గురువారం పంపిణీ చేసింది. గ్రూపు సభ్యులైన ఐదుగురు రైతులు శ్రీనివాసులరెడ్డి, కృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, మోహన్, వంశీధర్‌లకు కిసాన్ డ్రోన్ పథకం ద్వారా నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చి డ్రోన్‌ను అందజేశారు. వ్యవసాయాధికారి గౌరి మాట్లాడుతూ 80శాతం సబ్సిడీతో డ్రోన్‌ను అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రాల ద్వారా 400 యూరియా బస్తాలను ఒక్కో రైతుకు 5 చొప్పున పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి గౌరి, అసిస్టెంట్ వ్యవసాయాధికారి కవిత, ఏఈవోలు సోనియా, సుమన్, పవన్, పద్మ, గీర్వాణి పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయ హుండీ లెక్కింపు



సత్యవేడు, మే 29: నాగలాపురం మండలం సురుటుపల్లెలో వెలసిన పల్లికొండేశ్వరాలయ పరకామణిని గురువారం తిరుపతి డివిజన్ దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణిరాజశయన, ఈవో పుష్పలత ఆధ్వర్యంలో లెక్కించారు. 67 రోజులకు గాను హుండీ ద్వారా రూ.5,73,453లు, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.44,102లు మొత్తం రూ.6,17,555లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







మహానాడుకు బయల్దేరుతున్న తొట్టంబేడు టీడీపీ శ్రేణులు, శ్రీకాళహస్తి నుంచి చెంచయ్యనాయుడు, ఎస్సీవీనాయుడు ఆధ్వర్యంలో వెళుతున్న టీడీపీ శ్రేణులు

మహానాడుకు దండెత్తిన పసుపుదళం

శ్రీకాళహస్తి, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో గురువారం జరిగిన మహానాడు బహిరంగ సభకు శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి పసుపుదళం పెద్దఎత్తున దండెత్తారు. శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రూరల్ మండలం నుంచి సుమారు 2వేలమంది టీడీపీ అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్లారు. చెంచయ్య నాయుడు సుమారు 30 బస్సులు, 20 కార్లను జెండా ఊపి బహిరంగసభకు ప్రారంభించారు. శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు. తొట్టంబేడు టీడీపీ మండలాధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో సుమారు 1,500మంది తరలివెళ్లారు. 20 బస్సులు, 18 కార్లను జెండా ఊపి మునిరాజా నాయుడు ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, బాలాజీరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భవన్ నుంచి గురువారం ఉదయం సుమారు 1,500మంది 20 బస్సులు, 20 కార్లలో మహానాడుకు బయలుదేరారు. ఎక్కడికక్కడ పార్టీ అభిమానులు, కార్యకర్తలు జేజేలు పలుకుతూ ఉత్సాహభరితంగా సందడిచేశారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివెళ్లారు.

- సత్యవేడు (ఆంధ్రజ్యోతి): సత్యవేడు, నాగలాపురం మండలాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. వేకువజామునుంచి ఆయా మండలాల నుంచి బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.
- వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం నుంచి మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భారతమ్మ, మునిభూషణమ్మ, కార్యకర్తలు తదితరులు న్నారు.
- బుచ్చినాయుడుకండ్రిగ, (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి 5 బస్సుల ద్వారా అనేక గ్రామాల నుంచి కార్యకర్తలు తరలి వెళ్లారు. మహానాడులో మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, సుధాకర్ నాయుడు, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.
- రేణిగుంట (ఆంధ్రజ్యోతి): రేణిగుంట పట్టణ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. మండలంలోని 19 పంచాయితీల ప్రధాన కేంద్రాల నుంచి టీడీపీ క్లస్టర్ ఇన్చార్జిల ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో కార్యకర్తలు, నాయకులు బయలుదేరి వెళ్లారు.
- పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జరుగుతున్నమహానాడు పసుపు పండక్కి గురువారం కూడా పిచ్చాటూరు మండలం నుంచి పెద్ద ఎత్తున మహిళలు, యువకులు బయలుదేరి వెళ్లారు. టీడీపీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభరాజులు జెండాఊపి టీడీపీ శ్రేణులను బస్సు ఎక్కించారు.



నాగలాపురం నుంచి బయలుదేరిన టీడీపీ నాయకులు



మహానాడు వద్ద వరదయ్యపాళెం టీడీపీ నాయకులు



బీఎన్‌కండ్రిగ నుంచి బయలుదేరుతున్న నాయకులు



రేణిగుంట నుంచి బయలుదేరుతున్న టీడీపీ నాయకులు



పిచ్చాటూరు నుంచి తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు

మాధవమాల హస్తకళల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, మే 29(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మాధవమాలలో తయారు చేస్తున్న హస్తకళల అభివృద్ధికి సహకారం అందిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మండలంలోని మాధవమాలలో కళాకారులు తయారుచేసిన కొయ్య బొమ్మలను గురువారం ఆయన పరిశీలించి, కళాకారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ హస్తకళల కళాకారులను ప్రభుత్వం పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. హస్తకళ బొమ్మలను లేపాక్షి ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చెక్క బొమ్మల తయారీని, కలంకారీ విధానాన్ని పరిశీలించి, నైపుణ్యత గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. శ్రీబాలాజీ వుడ్ కార్వింగ్ ఆర్టిజన్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా కావాల్సిన సదుపాయాలు, వసతులపై చర్చించారు. మాధవమాలలో చేతివృత్తి చేస్తున్న వారికి టూల్ కిట్స్ అందజేసి, గుర్తింపుకార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. నిజమైన కళాకారులు డ్వాక్రా బజార్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎయిర్‌పోర్టులో, తిరుమలలో షాపులు, టీటీడీ కల్యాణ మండపాల్లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. కర్లపూడిలో కళాకారులకు మోటార్లు అందిస్తామని, ఇల్లు లేని కళాకారులకు మూడుసెంట్ల భూమిని కేటాయిస్తామని తెలిపారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి, జిల్లా జీవనోపాధుల అధికారి ధనంజయరెడ్డి, తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యమ్మ, సర్పంచ్ కరీముల్లా, ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి, ఎస్వీ ఈపీ ఏపీఎం దుర్వాసులు నాయుడు, ఏపీఎం కోమల, హస్తకళల సెక్రటరీ దశరథాచారి, శ్రీబాలాజీ వుడ్ కార్వింగ్ సంస్థ అధ్యక్షులు లోకనాథాచారి, కార్యదర్శి రాజాచారి, సీఈవో కృష్ణమూర్తి, కలంకారీ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



కొయ్యబొమ్మల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

భక్తిశ్రద్ధలతో అంకాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో రౌద్రూలి అంకాలమ్మ

నారాయణవనం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళం ఉత్తరంలో వెలసియున్న రౌద్రూలి అంకాలమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం గెరిగెను భక్తి శ్రద్ధలతో గ్రామ పొలిమేర వరకు ఊరేగించారు. అనంతరం అంకాలమ్మకు అభిషేకాలు చేసి నిత్య పూజా కైంకర్యాలు, పూజలు నిర్వహించి, నడివీధిలో ప్రతిష్ఠించారు. పెద్ద ఎత్తున భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తల మీద వేపాకు అలంకరించిన మట్టి దుత్తలను పెట్టుకుని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి నిమజ్జనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి నిమజ్జనంతో జాతర ముగిసింది.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

ఏర్పేడు, మే 29(ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరకారోగ్యానికి యోగా అత్యవసరమని ఎంఈవో దయాకరరావు అన్నారు. గురువారం ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ నిత్యం చేయాలన్నారు. వ్యాయామోపాధ్యాయులు శివకుమార్, వాణి, నచ్చనేరి పంచాయతీ కార్యదర్శి వెంకటముని, సచివాలయ సిబ్బంది, సీఆర్పీలు మునీశ్వర్, వెంకటముని పాల్గొన్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లమాల ఉన్నత పాఠశాలలో గ్రామస్తులకు యోగాసనాలపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఎంఈవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ యోగా మనిషి జీవితంలో భాగం కావాలని, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. పీడీ హరి, కార్యదర్శి మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ సోకిన వారిని వివక్షకు గురిచేయరాదు

సత్యవేడు, మే 29 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ సోకిన వ్యక్తిని వివక్షకు గురి చేయరాదని స్టెప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ భాస్కర్ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ - నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం మన సంస్కృతి కళాసంస్థ రెడ్డప్ప బృందం హెచ్ఐవీపై కళాజాత నిర్వహించింది. హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియంత్రణ పద్ధతులను నాటిక, గేయాల రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా

వరదయ్యపాళెం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై గురువారం వరదయ్యపాలెం బస్టాండు వద్ద కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపిస్తుంది, రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి వంటి వాటిపై అర్థమయ్యేలా మన సంస్కృతి కళా సంస్థ, రెడ్డెప్ప బృందం నాటిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టెప్స్ సంస్థ మేనేజరు భాస్కర్, సిబ్బంది రోజా, ఏఎన్ఎం మౌనిక తదితరులు పాల్గొన్నారు.